# జోజో ముకుందం



**రాహుల్ చంద్రశేఖర్**

**"జో** అచ్యుతానంద జోజో ముకుందా... లాలి పరమానంద రామ గోవిందా..." చక్కని పాటలు వినిపిస్తున్నాయి. మధ్యాహ్నం మూడు గంటలై ఉండవచ్చు. ఆకాశంలో మేఘాలు కమ్ముకుంటున్నాయి. సన్నగా వానజల్లులు పడుతున్నాయి. జోగినాధం ఆనందంగా నడుస్తున్నాడు. తన జీవితంలో ఇంతవరకు ఇంతటి సంతోషకరమైన క్షణాలు ఎదురుకాలేదు. సభా భవనంలోకి అడుగు పెట్టింది తడవు చక్కటి గుబాళింపు సభంతా మత్తు గొలుపుతోంది. "జోగినాధానికి జై! జోజో ముకుందానికి జై" సభ మొత్తం నినాదాలతో మార్మోగిపోయింది. అందరికీ అభివాదం చేస్తూ ముందుకు సాగిపోయాడు.

జోగినాధానికి ఎన్నో సంవత్సరాల నుంచీ ఏదో చేయాలనే తపన ఉండేది. అదీ జీవితానికి అత్యావశ్యకమైంది, అందరికీ అందుబాటులో ఉండేది, ఖర్చు లేనిదీ, అంతేకాక కోట్లాదిమందికీ, మరీ చెప్పాలంటే ప్రపంచంలో ఆరు వందల కోట్ల మందికీ ఉపయోగపడేది ఏదో చెయ్యాలనే! ఎప్పటి నుంచో తన మెదడులో మెదులుతూ ఉన్నా, ఈ ఆలోచనకు పదును పెట్టే అదనుకోసం ఎదురుచూస్తే ఇన్నాళ్ళకు తన ఆలోచన ఓ కొలిక్కి వచ్చింది. సహోద్యోగులు, పుర ప్రముఖులు ఎందరో వెన్ను తట్టి, భుజం తట్టి ప్రోత్సహించారు. మేమంతా మీ ముందుంటామన్నారు. అందుకే ఇప్పుడు తన ముందే ఆశీనులై ఉన్నారు.

ఇంతకీ సంగతేమిటంటే స్వయానా తనో ఉద్యోగిగా ఒక మహోద్యమ బాధ్యతలు చేపట్టడమే! ఆ ఉద్యమానికే "నిద్దర ఉద్దారణ ఉద్యమం" లేక 'నిద్దర ఉద్యమం' అంటూ నామకరణం చేశారు.

అధ్యక్షుడిగా పీఠంలో కొలువుదీరాడు. సహజ సిద్ధమైన దుస్తులతో పాటు వెచ్చగా ఓ శాలువ, మఫ్లర్ ధరించి నింపాదిగా కూర్చున్నాడు. తల పైకెత్తి సభ వైపు చూశాడు. అంతా తన వంకే చూస్తున్నారు. జోగినాధానికి కించిత్ సిగ్గూ, బిడియం ఆవహించింది. అయినా తన శాల్తీ గంభీరత్వం ముందు ఈ సిగ్గెంత అంటూ మనసులోనే మురిసిపోయాడు.

ఈసారి జోగినాధం చూపు సభ వెనక పక్క, గోడలకు వేలాడుతున్న పెయింటింగ్స్‌పై పడింది. ఒక చిత్రంలో ఉయ్యాలలో బాబు నిద్రపోతున్నాడు. బాబు పైన ఈగలు, దోమలు దాడి చేస్తున్నట్లు, దోమలపైకి బాణం పోతున్నట్లు, బాణం మీద 'నిద్దరోద్యమం' పేరు రాశారు. ఆ

చిత్రానికి పక్కనే కుంభకర్ణుడు, భీముడు, ఇతర సుప్తావస్థను పొందే జీవ జంతువుల బొమ్మలున్నాయి. మరో బ్యానర్‌పై "కునుకే కూడు - నిద్రే నీరు' లాంటి స్లోగన్స్ ఉన్నాయి. ఆ చిత్రకారుడి సృజనాత్మకతకు అబ్బుర పడిపోయాడు జోగినాధం. అతనెవరో పిలవమని పక్కనున్నవారితో మెల్లగా చెప్పాడు. "సార్ అతను రాత్రంతా బొమ్మలేసి ఇప్పుడు నిద్రపోతున్నాడ"ని చెప్పగానే, "అయితే అతనే మన ఉద్యమానికి స్ఫూర్తి, అలాగే నిద్రపోనివ్వండి, లేపకండి" అన్నాడు.

శాలువ, మఫ్లర్ టేబుల్‌పైన పెట్టి నెమ్మదిగా పైకి లేచాడు. జోగినాధం వాక్ప్రవాహం కోసం కొలీగ్స్, ఇంకా సభా సధులంతా ఎదురు చూస్తున్నారు. గొంతు పెగుల్చుకుని మైక్ పట్టుకున్నాడు. అధ్యక్షుడి తొలి పలుకులు ప్రారంభమైనాయి. "సభాసదులందరికీ మీ జోగినాధం తొలి వందనాలు. ఈ ఉద్యమ పోరాట సమావేశానికి విచ్చేసిన నిద్రలేమి పీడిత సోదరులకు, నిద్రలో నడక సాగించే సోదరులకు, మన పోరాటాలతో నిమిత్తం లేకుండా ముందు నుంచీ కొంత నిద్రకు అలవాటైన నాతో పాటు నా సహోద్యోగులందరికీ వందనాలు". జోగినాధం భాషకు చాలా మంది అభ్యంతరాన్ని లేవదీశారు. భాష అర్థం కాలేదన్నారు.

"అయ్యలారా! నాగార్జున యూరియా అంత స్వచ్ఛమైందీ, చిక్కనైందీ, నా తెలుగుభాష" అన్నాడు.

దీంతో కొందరికి చిర్రెత్తుకొచ్చి "మీకు భాషంటే మీ ఇంట్లో హైస్కూలు పిల్లలకు, లేదా మీ వీధి పిల్లవాళ్ళకు తెలుగు పండిట్‌నని ట్యూషన్ చెప్పుకోండి. ఎప్పుడో ఏడు, ఎనిమిది క్లాసుల్లో పద్యం, భావం చెప్పకుంటే గోడకుర్చీ వేయించేవాళ్ళు. ఒళ్ళంతా కొట్టేవాళ్ళు. ఈ బాధలు పడలేక నాలుగు లైన్లు కంఠస్తం చేసి ఒప్పజెప్పేవాళ్ళం" అన్నారు. "ఔనండీ! భాష యూరియా కాదు. కాంప్లెక్స్ అయిపోయింది. పోతే పోనీ చద్దెన్నం లాంటి తెలుగు పదాలకు, ఊరగాయ లాంటి ఇంగ్లీషు అద్దిస్తాను. చప్పరిస్తూ వినండి" అన్నాడు.

"మై డియర్ నిద్రాభిమానులారా! ప్రపంచంలో జీవకోటికంతటికీ అనాదిగా వస్తున్న ప్రకృతి సహజమైన సుఖం, విశ్రాంతి కూడా నిద్రే. అదేనండీ స్లీప్. ఈ సభను జరపడానికి ముఖ్య ఉద్దేశం మంచి నిద్ర, సౌఖ్యమైన నిద్ర, కులాసాయైన కునుకు. దీనికోసం నా జీవితాన్నే ధారపోస్తాను. నా నిద్రనైనా మాని, మీ నిద్ర కోసం

## అంత సీన్ లేదు

నిన్నగాక మొన్న కాలుపెట్టిన నేహా ధూపియా అప్పుడే తానేదో పెద్ద స్టార్ అయిపోయినట్లు ఫీలయిపోతోంది. ఇటీవల ఓ యాడ్‌లో నటించడానికి కోటి రూపాయలు అడిగిందట. గత పదేళ్ళుగా సినిమా ఇండస్ట్రీలో ఉన్న ప్రీతీజింతా, రాణీముఖర్జీలకే అంతటి మొత్తాన్ని ఇవ్వడానికి ఎవరూ ఒప్పుకోరు. అలాంటిది తొలి సినిమా కూడా రిలీజ్ కాని నేహాకు అంత మొత్తం ఎవరిస్తారు. తన కంత సీన్‌లేదని యాడ్ ఏజన్సీకి తెలిసినా నేహాకు మాత్రం తెలియడం లేదు.

అహర్నిశలు పాటుపడతాను. ఇందుకు ప్రతిజ్ఞ కూడా చివర్లో చేద్దాం. అంతేకాదండోయ్! ప్రపంచంలో ఎన్నో క్లబ్బులున్నాయి. నవ్వుకో క్లబ్బు, ఏడుపుకో క్లబ్బు, కోపానికో క్లబ్బు, శోకానికో క్లబ్బు, పిచ్చికో క్లబ్బు, గిచ్చుకోటానికో క్లబ్బు. మనకో క్లబ్బుంటే తప్పేంటి? అసలు మనమేం పాపం చేశాం? నిద్రపోవడం కూడా పాపమేనా? అలాగని ఏ రాజ్యాంగంలో ఉంది?" కోపంగా జనం వంక చూశాడు.


జోగినాధం ప్రసంగానికి జనం సీరియస్ అయిపోయారు. "ఎక్కడ జోగినాధం, ఎక్కడ రాజ్యాంగం?" అవాక్కయిపోతున్నారు.

"కూల్ డౌన్" అన్నారెవరో జనంలోంచి. అలాగే అన్నట్లు జనం వంక చూసి ప్రశాంతంగా మళ్ళీ ప్రసంగం మొదలెట్టాడు.

"అసలు నిద్రెలా వస్తుందండీ? దేవుడి ఊరేగింపైనా మేళతాళాలతో టపాకాయల సందడితో మహా ఆర్భాటంగా వస్తుంది. అంతెందుకు మనిషి పుట్టుకే అరుపులు, కేకలు, పెడబొబ్బలతో వస్తుంది. నిద్రిలా రమ్మంటే వస్తుందా? రాదే!" జనంలోంచి పెద్దగా చప్పట్లు.

"నిద్రను వర్ణించ పూనుకుంటే కవి కూడా నిద్రపోతాడండీ! 'కంటి నిండా నిద్ర కడుపు నిండా తిండి' కంటికి మాత్రం నిద్రన్నది సమంజసం కాదు. దీన్ని మన సంఘం ఖండిస్తున్నది. కాలి నుంచి తల వరకు ప్రతి భాగం నిద్ర పొందేదే. ఇకపై మనమంతా పై సామెతలోని పొరపాటును ఎత్తిచూపాలి. అప్పుడే మన ఉద్యమానికి ఊపిరిపోసినవాళ్ళమవుతాం.

నిద్రపోయే వాళ్ళంతా సోమరులంట. ఇదీ తప్పే. దీన్ని కూడా మన సంఘం ఖండిస్తున్నది. అలాగైతే ప్రపంచ జనులంతా సోమరులే. అయినా కావాలనే ఎవరు నిద్రపోతారండీ. అదే వస్తుంది కాబట్టి నిద్రపోతాం. ఏదీ మీరిప్పుడే ట్రై చెయ్యండి చూద్దాం? నిద్రపోలేరు. కానీ



అప్రయత్నంగా మన ప్రమేయం లేకుండా ఒక్కోసారి వచ్చేస్తుంది. ఇది మన తప్పు కాదు. ప్రకృతి తప్పే".

ఈ బిజీ బిజీ జీవితంలో సుఖమెక్కడుం దండీ? ఎంత కష్టపడినా ఎన్ని పనులు చేసినా, తిన్నా, తాగినా, చివరకు నిద్రలోనే మనసుకూ, శరీరానికీ, సుఖం వెతుక్కుంటాం. ఇకపోతే ఉద్యోగులందరికీ నిద్రంటారు కానీ ఏం నిద్రండీ! ఎప్పుడు చూసినా ఎవరో వచ్చి పాడు చేస్తుంటారు. ఇంటి దగ్గరా ఇల్లాలి దెప్పిపొడుపులకు అలవాటు పడి కునుకు పట్టడం గగనమే. నిద్రపోయే వాళ్ళను చూసి అసూయ చెందేవాళ్ళే ఇలా అంటారు.

"కాబట్టి నిద్రాశయులారా! నిద్రాశ్రయులారా! నా మాట వినండి ఈ లోకం, ఈ లోకులు మనల్ని నిద్రపోనివ్వరు. ఉద్యమించాల్సిందే! ఇదీ కాక 'నేను నిద్రపోను - మిమ్మల్ని నిద్రపోనివ్వనని, కేవలం ఇన్ని గంటలే చాలు నిద్రకు' లాంటి ఆందోళన కలిగించే దుర్వార్తలు తరచూ వినవస్తున్నాయి. ఇవి మన ఉద్యమానికి గొడ్డలిపెట్టు లాంటివి. ఇప్పుడే ఇలా నిద్రను కోల్పోతే రాబోవు తరాలు, అంటే ఫ్యూచర్ జనరేటర్ (సారీ) జనరేషన్‌కి కంప్యూటర్‌లో మాత్రం చాలా ఏళ్ళ క్రితం మనుషులిలా నిద్రపోయారని చూపాల్సి వస్తుంది. ఇది నాకు బాధగా ఉంది". సభంతా సైలెంటయిపోయింది. కొంతమంది కళ్ళల్లో గిర్రున నీళ్ళు తిరగడం చూశాడు జోగినాధం. "అయ్యలారా ఏడవటం

కాదు, నిద్రపోవటం ముఖ్యం'' అన్నాడు ఓదారుస్తున్నట్లు.

"మనసారా ఏడ్చిన తర్వాతే కదండీ నిద్రొచ్చేది'' అన్నాడొకతను వేదాంత ధోరణిలో. నిజమేనన్నారు కొంతమంది.

ఇంతలో మరొకతను లేచి "జోగినాధం గారూ! నిద్ర, నిద్రంటున్నారే! నిద్ర ఎన్ని రకాలు, అసలు ఎలాంటి నిద్ర అవసరమండీ?'' అన్నాడు.

'వెరీ గుడ్! ఇదీ మంచి ప్రశ్నే! నిజానికి నిద్రలో ఏది ఎలాంటి నిద్రో చెప్పటం కష్టం. మనం నిద్రపోయేటప్పుడు గుర్రున గురక పెట్టి నిద్రపోతామో, లేదా చొంగ కారుస్తూ నిద్రపోతామో మనకు తెలీదు. మన చొంగను, గురకను చూసినవాళ్ళే చెప్పాలి మనది ఎలాంటి నిద్రోనని. కానీ నిద్ర లేచిన తర్వాత మాత్రం టైం చూసుకుని చాలా సేపు నిద్రపోయా. మంచి నిద్ర అంటూ వుంటాం. ముఖం కడుక్కుంటాం. దీనికి చాలా మంది ఒప్పుకోలేదు. పైకి లేచి "మేం ఒప్పుకోం... మాది అలాంటి నిద్ర కాదు'' అన్నారు అసహనంగా.

"నో... నో... అది తప్పండీ జీవితంలో ఏదో సమయంలో చాలా మంది చొంగ కార్చినవాళ్ళే. గురక పెట్టినవాళ్ళే. అది మీకు తెలీదు. అసలిదంతా ఎందుకు? ఈ వాదన మానండి. మన ముందు మన సమస్యలు గంపెడున్నాయి'' అనగానే సభ మామూలు కొచ్చింది.

"డియర్ కొలీగ్స్! అనాది నుంచీ మనిషి సగం జీవితం నిద్రలోనే గడుపుతున్నా, దాని కోసం కొన్ని లోటుపాట్లు సరిదిద్దుకోలేకపోతున్నాడు. ఇంటికో దేవుడు, వీధికో దేవుడు, సందుకో దేవుడున్నాడు. కానీ నిద్రకు ప్రత్యేకించి దేవుడే లేడు. నిద్ర సార్వత్రికమైనది. నిద్రకు మతం, జాతి, భాష, ప్రాంతీయ, లింగ, వర్గ భేదాలే లేవు. కాబట్టి నిద్రకు దేవుడెందుకు ఉండకూడదు? ముల్లు గుచ్చుకుంటేనే అమ్మో... అయ్యో... స్వామీ... అంటాం. గంటకు ఒకసారి దేవుడి పేర్లు కలవరిస్తాం. మరి రాత్రంతా పోవాల్సిన నిద్రకు ఆ మాత్రం దేవుడుండకూడదా? అందుకే సార్వత్రిక నిద్రాదేవి విగ్రహాన్ని రూపొందించి, ప్రతిష్ఠించాలి. నిద్ర మాత కోసం మంత్రాలు గట్రా రాయించాలి'' చప్పట్లు మార్మోగాయి.

"అంతే కాదండోయ్! కన్నుకో డాక్టర్, పన్నుకో డాక్టర్, కాలుకో డాక్టర్. వేలుకో డాక్టర్ ఉంటే నిద్రకెందుకు స్పెషలిస్టులు ఉండకూడదు? సిగ్గు సిగ్గండీ తల వంచండి'' అన్నాడు. చెప్పిందే తడవుగా అంతా తలలు వంచేశారు. 'ఇక పైకెత్తండి' అనగానే జోగినాధం ఇచ్చిన బ్రేక్‌కి పైకి లేచి మరీ చప్పట్లు కొట్టి ఈలలేయసాగారు.

"నిదానించండి. పెద్ద శబ్దాలు మన ఉద్యమానికి శత్రువు. అలారం, సైరన్ మొదలైనవన్నీ మన వైరి వర్గంలోనివే. మీరిలా గట్టిగా ఈలలేస్తే 'నిద్రాభంగాన్ని' ప్రోత్సహించినట్లే అన్నాడు.

'మరి సభలో నిద్రపోతే పరవాలేదు కదండీ' అన్నాడొకతను ఆవలిస్తూ.

"ఎంతసేపూ అలా కళ్ళు నులుముతూ, ఆవలిస్తూ కాలక్షేపం చేయకపోతే హాయిగా నిద్రపోవచ్చు కదా! మన ఉద్యమ ఏకైక లక్ష్యమే అదే కదండీ'' జోగినాధం బదులుతో కొందరు నిద్రకు ఉపక్రమించారు.

"జనులారా! మీ నిద్రే నాకు ముఖ్యం. నిద్రపోయేవాళ్ళను లేపకండి. మేలుకొల్పితే మన మహోద్యమం నీరుగారిపోతుంది. మేలుకుని ఉండేవాళ్ళే వినండి'' అన్నాడు.

"ఈనాటి స్ఫూర్తి రేపటి ఉద్యమానికి నాంది. త్వరలో మన సంఘాన్ని ఐక్యపర్చి ఊరేగింపులో పాల్గొంటాం. జయజయ నినాదాలతో మన సమస్యలు వివరిద్దాం, వినతి పత్రాన్ని సమర్పిద్దాం. జయించేంత వరకు పోరాడుదాం''.

"బహుశా పోరాటంలోగానీ, ఊరేగింపులోగానీ మన నిద్రలో వాక్ చేసే సోదరులు పాల్గొని ట్రాఫిక్‌లో నిద్రపోతూ నడిచి, కాళ్ళూ, చేతులూ లేదా ప్రాణం పోతే సార్' అన్నారెవరో తూగుతూ.

"అలాంటి వాళ్ళు మన సంఘానికి త్యాగవీరులు, నోబుల్ పర్సన్స్, చిరస్మరణీయులు'' జోగినాధం తనకు తెలీకుండానే ఏవో మంచి మాటలు మాట్లాడేస్తున్నాడు. తనకీ నిద్రొస్తోందనిపిస్తోంది. కానీ ఇంకా నాలుగు మాటలు చెప్పాలని ఉంది. తనతో పాటు వేదికపైన ఉండేవాళ్ళు మాట్లాడాల్సి ఉంది.

అయ్యలారా! మరికొన్ని మాటలే చెప్పి ముగిస్తాను. 'నిద్రమాత్రలు - మనకు నేస్తాలు' 'దద్దమ్మ, తిట్టు కాదు, పోరాటానికి పట్టు'. ఆఫీసు నిద్రకు కుర్చీ (కం) బెడ్, బాస్ సమకూర్చాలి. ఇప్పుడు మన సోదరులు ప్రసంగిస్తారు.

జై నిద్ర మాతా! జై జై నిద్రాదేవీ!''

* * *

జోగినాధాన్ని ఎవరో తట్టి లేపుతున్నారు. "పోనయ్యా నేను ప్రెసిడెంట్‌ని. నిద్రకోసమే ఇంత దాకా మాట్లాడాను కదా!'' మగత నిద్రలో ఎదుటివాళ్ళ చెయ్యి నెట్టుతూ జోగినాధం సమాధానం. ఎవరో గట్టిగా తట్టి లేపారు. జోగినాధం ఈసారి ఉలిక్కిపడి లేచాడు. ఎదురుగా బాస్. తన కళ్ళను తానే నమ్మలేక పోయాడు. ఇంతవరకు జరిగింది నిజమా? కలా? ఒళ్ళు గిల్లుకునే ధైర్యం కూడా జోగినాధానికి లేదు.

"సారీ సర్!'' అని మాత్రం అన్నాడు వణికే కంఠంతో.

"నో... నో... నువ్వు నెల రోజులు హాయిగా ఇంటి దగ్గరే నిద్రపోవచ్చు. ఈ పూట నుంచే నీకు సస్పెండ్ ఆర్డర్ మంజూరు చేస్తున్నాం'' బాస్ కంఠం జోగినాధం చెవుల్లో బాంబు పేల్చినట్లయింది.

*



## ఓ బొజ్జ గణపయ్య

ఓ బొజ్జ గణపయ్య
మా వూరు రావయ్యా
వేచివున్నాం మేమయ్యా
నీ కొరకు ఉండ్రాళ్ళు చేసినాము
ఆనంధంగా ఆరగించవయ్యా
భక్తితోన నిన్ను కొలిచినాము
అభిమానంతో ఆదరించవయ్యా
చిన్నవారు, పెద్దవారు
నీ కోసం క్యూ కట్టినారు
నీ ఆశీర్వాదం కోరినారు
నీ కరుణా కటాక్షాలకై
పరితపించినారు
నిన్నే స్మరించినారు
ఎలుక వాహనమెక్కి
వేగంగా పోయేవు
మమ్ము ఆదుకొనెదనని
హామీ ఇచ్చి కదలవయ్యా
నీ వారం మేమయ్య
ఓ బొజ్జ గణపయ్య

- డా. రాగతి రమ